"చూడండి ఆ వికవికలు! ఎవరేనా వింటే నవ్విపోరూ. దానికొచ్చిన వయస్సుకి! హవ్వ!" అంటూ భర్త పక్కన చేరి గుసగులాడింది సుందరమ్మగారు. బాగా తలపండినా తల్లో మల్లెలు గుబాళిస్తున్నాయి. ఆ చీకట్లో ముఖాన వుంచిన అర్థ రూపాయ కాసంత కుంకుమ బొట్టు మెరుస్తూంది. చెవులకి నీరు దిగిన తెల్లరాళ్ళ దుద్దులు గుడ్డి దీపాల్లాగా వున్నాయి. పట్టెడనేసిన మంచం మీద నడుం వాల్చి వాసాలు లెక్కపెడుతున్న భర్తనో పొడుపు పొడుస్తూ అంది.

# పలితకేశం!

## కె. రామలక్ష్మి

పెళ్ళాం చెప్పేదాకా వెంకట్రామయ్యగారికా నవ్వులు వినిపించనే లేదు! ఇల్లేం పెద్ద నాలుగిళ్ళ లోగిలా! కాదు. రెండు గదులు, వంటిల్లూ-ఓ ముదనష్టపు వరండా. వరండాలో ఓ మడత కుర్చీ. దాని ముందో క్రర స్టూలు. ఓ గది కూతురికి ధారాదత్తం చేసినందుకు విలవిల్లాడిపోతూంది సుందరమ్మగారి మనస్సు.

"చిన్నాడూ పెళ్ళాం వచ్చినా, పెద్దది వచ్చినా దాని గదిలోకి అడుగెట్టనిచ్చేదా? ఇప్పుడు స్వంతంగా ఓ మొగుడొచ్చాడని చూడండి మన ముఖాన తలుపులెలా బిడాయించిందో" అంటూ పెట్టిన మంచినీళ్ళ చెంబే తిరిగి ధమ్మున మంచం పక్కన పెట్టేంది. నిట్టూరుస్తూ పెళ్ళాం కేసి చూశారు- వెంకట్రామయ్యగారు.

"తెలుస్తూందే నీ బాధ. ఊరుకో. ఏం చేస్తాం చెప్పు. కొడుకులు చెయిజారిపోయారు చూస్తుండగానే. ఈ కూతుర్ని ఎలాగో ఇన్నేళ్ళు కంటికి రెప్పలాగ కాపాడి, కన్ను దాటిపోకుండా చూస్తూ వచ్చాం. ఏం చేస్తాం చెప్పు? మనం సర్దుకుపోవాలి. కాల మహిమ!" వేదాంతం చెప్ప జూచారు వెంకట్రామయ్యగారు. వినే మూడ్‌లో లేరు సుందరమ్మగారు. ఆవిడకా కూతురు నవ్విన నవ్వు - కంపరం పుట్టిస్తోంది. ఎవరో ఒడ్చి వెన్ను మీద తన్నినట్టుగా అనిపిస్తూంది. ఎందుకలా అనిపిస్తూంది? అదీ. అక్కడే వుంది - కథ.

సుజాతకి ముప్ఫయి రెండేళ్ళు దాటిపోయాయి - ఓ ఆర్నెల్ల క్రిందట. మంచి ఉద్యోగంలో వున్న సుజాత మంచి మనసున్న మనిషి కూడా కావడంతో చదువుకునే రోజుల నుంచీ, అందరినీ సహనంతో భరిస్తూ 'నడవండి నడవండి, నా మీంచి నడవండి, గడ్డి పరకను నేను' అన్నట్టు తయారై అందరికీ మహా లోకువ అయిపోయింది. 'ఏమే! పెళ్ళి మాట ఏం చెయ్యమంటావు?" అని అడిగే తండ్రికి "ఏం తొందర నాన్నా!"అని చెప్పిందే తప్ప "నాకు పెళ్ళి చేసేయండి నాన్నా" అని ఎప్పుడూ చెప్పలేకపోయింది!

"దాని ముఖం దాన్నడగడం ఏమిటండీ? చూడాలి సంబంధాలు" అని సాగదీసే తల్లి కేసి నిండు మనసుతో మెచ్చుకునేది. కాని ఆ తల్లి, తండ్రి కలిసి తనతో ఆట పట్టిస్తున్నారని ఎన్నడూ అనుకోలేదు సుజాత.

చక్కని ఉద్యోగంలో - నిచ్చెన మెట్లెక్కినట్టు టకటక ఎక్కేస్తూ పైపైకి చక్కా పోతున్న కూతురి పెరిగే సంపాదన చూడముచ్చటగా అనిపించిందా తల్లిదండ్రులకి. కాని పెరుగుతూ పోతున్న ఆమె వయస్సు మటుకు కన్పించడం మానేసింది.

"సుజాతా, వాడికో మంచి సంబంధం వచ్చింది"అంటూ కొడుక్కి సంబంధాలు వస్తూంటే మురిసిపోతూన్న తల్లిని చిన్నబుచ్చలేక "వాడికి చేసేయ కూడదమ్మా నచ్చితే' అనడం సుజాత అలవాటు చేసుకుంది. కాని "అక్కకి పెళ్ళి చేయండి ముందు,తరువాత నేను"అని ఆ ముద్దుల తమ్ముడు మనసారా అనలేకపోయాడు!

ఏళ్ళు గడిచాయి. తమ్ముళ్ళు, పెద్ద చెల్లెలు పెళ్ళిళ్ళయి హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. తమ్ముడు హాయిగా ట్రాన్సర్ చేయించుకుని చిన్న గూటికి మారిపోయాడు కూడా! 'అక్క దేవత! అక్క ఎంత మంచిది!' అంటూ సుజాతని సింహాసనం మీద కూర్చోబెట్టి కాళ్ళు భూమిలో గట్టిగా పాతేశారు అంతా కలిసి. దాంతో కుటుంబ బాధ్యతలలో మరీ దిగబడిపోయి - తనకేం కావాలో తేల్చుకోలేక మౌనంగా వుండిపోయింది సుజాత.

పురుళ్ళకీ, పుణ్యాలకీ అండగా నిలబడడంలో తృప్తి వుంది. కాని గుర్తింపు లేని చాకిరీలో సంతోషం కన్పించడం మానేసింది — సుజాతకి. ఈ విషయం పట్టించుకునే వాళ్ళే లేరు - 'అసలు తల్లీ, తండ్రే వూరుకున్నప్పుడు ఇంకెవరికి పడుతుంది నా బాధ్యత' అని మనసులో నిట్టూర్చుకుని పైకి నవ్వేసేది సుజాత.

ఓ రోజు దూరపు బంధు వొకాయన వచ్చి పరిస్థితి కాస్త మార్చాడు. "ఏరా, వెంకట్రామయ్యా, ఇక ఈ ఆడ కూతురికి పెళ్ళి చేసే ఉద్దేశం లేదా!" అంటూ భోజనాల దగ్గిర నిలదీశాడు.

"పెట్టింది తినిపోక అధిక ప్రసంగం ఒకటి" అంటూ సుందరమ్మగారు విసుక్కున్నారు.

"సాయంత్రం సుజాత ఇంటికి వచ్చాక ఈ మాట అనేరు కనక?" అంటూ చుట్టాన్ని హెచ్చరించారు సుందరమ్మగారు.

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడా చుట్టం.

"అది అంతేనయ్యా, ఎన్ని సంబంధాలని చూడం చెప్పు. ఒక్కటి కూడా నచ్చదు దానికి. ఏళ్ళూ పూళ్ళూ గడిచిపోయాయి. చిన్నదానికి చెయ్యలేదుటయ్యా" ఎదురు ప్రశ్న వేశారు.

"చేశారు. దానికి చదువా సంధ్యా! ఉద్యోగమా? తిండి దండగ అనుకుని చేసేసి వుంటావు?" హ హ హ అంటూ తన జోక్‌కి తనే గట్టిగా నవ్వేశాడాయన. వెంకట్రామయ్యగారి ముఖాన కత్తివేటుకి ఆ క్షణాన నెత్తుటి బొట్టు లేనట్టయిపోయింది. మరుక్షణాన తేరుకున్నారు. "ఓరినీ! అదేం మాటరా!" అని తేలికగా నవ్వి ఊపిరి తీసుకున్నారు.

"మరి! ఆడపిల్ల పెళ్ళి చెయ్యమని అడుగుతుందా? నీ చిన్న కూతురు అడిగితేనే చేశావా? చూడు వెంకట్రామయ్యా- నువ్వు దాని జీతం మరిగావు. అంతకు మించి వేరేం లేదు" నిక్కచ్చిగా అంటూ భుజం మీది తువ్వాలోసారి గట్టిగా దులిపి మళ్ళీ పడేసుకున్నాడు.

'వీడెవడు! చుట్టమై వచ్చి దెయ్యమై పట్టుకునేలా వున్నాడే' అనుకుంది సుందరమ్మ. అంతే కాదు 'వీళ్ళకెందుకు దానికి లేని బాధ. వచ్చిన వాళ్ళు పని చూసుకుపోక ఈ సోది ఎందుకు?' "అన్నయ్యగారూ, మేం ఏ సంబంధం చూపినా దానికి నచ్చడంలేదు. పోనీ మీరు చూడకూడదా?" అంది కాస్త ఎద్దేవాగా.

"అదిగో. అలా అన్నావు బాగుంది. రానివ్వండి. సుజాతనే అడిగేస్తాను, దాని కెలాంటివాడు కావాలో" అన్నాడా పెద్ద మనిషి హాయిగా నవ్వేస్తూ.

అదే టైములో సుజాత ఆఫీసు నుంచి బయలుదేరి ఓ బస్సు ఎక్కి ఓ కిలోమీటరు నడిచి నిస్త్రాణగా ఇల్లు చేరింది. ఆమె ముఖం దీనంగా వుంది. ముఖం వాడిపోయింది. చెదిరిపోయిన జుట్టు చేత్తో సర్దుకుంటూ తన గదిలోకి వెళ్ళబోతూ నవ్వు వినిపించి ఆగింది.

"రామ్మా సుజాతా! నీకు వేలువిడిచిన మేనమామ వచ్చాడు" అంటూ వెంకట్రామయ్యగారు సుజాతని పిలిచారు.

గదిలోకి వెళ్ళి బాగ్ పడేసి కాస్త ముఖం కడుక్కుని వచ్చి

కూర్చుంది సుజాత.

"కాఫీ ఇవ్వండ్రా..." వచ్చిన మట్టం సూచించాడు. ఆ మాటకి నవ్వొచ్చింది సుజాతకి. అమ్మ రాగానే ఎప్పుడూ అడగదు 'కాఫీ తాగుతావా? ఏమైనా తింటావా' అని.

"అదేం తాగదు...ఆఫీసులో తాగి వచ్చేస్తుందేమోనని వూరుకుంటాను" నిష్ఠూరంగా అంది సుందరమ్మ.

"ఏం సుజాతమ్మా! అంతేనా? నిన్ను ఎవరు కట్టు కుంటాడోగాని - మహా అదృష్టవంతుడవుతాడు" నవ్వాడు.

"లేదు మామయ్యగారు, నన్ను కట్టుకున్నవాడెలా అదృష్టవంతుడవుతాడు!" తిరిగి ప్రశ్నలాగే తన అభిప్రాయం చెప్పింది...

"బలే గట్టిదానివమ్మా. ఇంతకీ పప్పన్నం ఎప్పుడు పెట్టి స్తావో చెప్పడం లేదు"

"దానికేం మహా భాగ్యం! మీ రేరోజు కావాలంటే ఆరోజు విందు భోజన్నమే. అమ్మతో ఒక్కమాట చెప్తేచాలు. ఏమ్మా?" తల్లి ముఖంలోకి కుతూహలంగా చూస్తూ అంది సుజాత.

"అదేం చోద్యమే. మామయ్యగారి మాటలు అర్థం కానట్టూ! చూశారా ఇదీ వరస?" తేలికగా కొట్టిపారేస్తూ అక్కడి నుంచి లేచి వంటగదిలోకి చక్కా పోయారు సుందరమ్మగారు.

"'అది కాదు సుజాతా! ఎన్నాళ్ళిలా? నీకూ ఓ ఇల్లూ, వాకిలీ స్వంతం కావాలిగా?" తన పక్కన చోటు చూపిస్తూ ఆప్యాయంగా అడిగారా మట్టపాయన.

ఎండిన బీడుపై తొలి వాన చినుకులాగా అనిపించిందా ఆప్యాయత సుజాతకి. ఎంత గంభీరంగా వుండాలని ప్రయత్నించినా గుండె గొంతులోకి వచ్చి కొట్టుకుని కంఠంలో ఏదో అడ్డుపడినట్టుగా - మాట రావడం మానేసింది.

"చూడూ! పెళ్ళి చేసుకోకూడదని నీ నిర్ణయం అయితే తప్పు లేదు. కాని పెళ్ళి చేయక, పెళ్ళి కాక జీవితం మోడువారిందనుకోవలసి రావడం - దుర్భరం సుజాతా. నీ దుర్భర జీవితం నీ చుట్టూ ప్రపంచం మీద అసహ్యం అన్నీ పెంచుతాయి. అది ప్రమాదకరమైంది. చెప్పు సుజాతా, నీ నిర్ణయం నీదేనా?" అనునయంగా అడిగారు.

సుజాత మౌనంగా కన్నీరు కార్చి మాటామంతీ లేకుండా కూర్చుంది.

ఆమె మనస్సులో మిణుగుడు పురుగుల్లాగా చీకటి వెల్గుల భావనలు. తమ్ముడి పెళ్ళి, చెల్లెలి పురుడు - తమ వాళ్ళ కోసం చేసిన దాంట్లో వాళ్ళంతా చూపిన స్వార్థం - అందర్నీ 'తనే కన్నా - ఆ తల్లి చూపిన వివక్షత, తండ్రి 'ఒకటో తారీకు ప్రేమ' ... ఒకటేమిటి సర్వం మెదులుతున్నాయి. ఈ వేలు విడిచిన మేనమామ పాటి తనని తన వాళ్ళు అర్థం చేసుకోలేదే అన్న ఆవేదన కృంగతీసింది.

"నీ మౌనానికి అర్థం నాకు తెలుస్తూంది సుజాతా. కాని నువ్వు సరే అనకుండా నీకు వరుణ్ణి వెతకడం ఎలా?" కాస్త నవ్వించాలని అన్నారు.

తలెత్తి ఆయన ముఖంలోకి చూసింది సుజాత. ఆమె కళ్ళు ఏడ్చి ఎర్రబడినా వింతగా మెరిశాయి.

"చూడు సుజాతా! వయస్సు ముదిరిన కొద్దీ మనిషిలో జంతుతత్వం పెరిగిపోతుంది. కొన్ని సందర్భాలలో ఆ జంతువులే నయం అనిపిస్తుంది. కడుపు బద్దలయేలా కక్కుర్తికి తినేస్తుందేమో గాని కూడబెట్టాలని చూడదు. పిల్లలకి మేపినన్నాళ్ళు మేపి తన్ని తగిలేస్తుంది - వాటి బ్రతుకులు అవి బ్రతకమని. మనిషి అలా కాదు. స్వార్థం జీర్ణించుకుపోయి పెట్టిన కొద్దీ ఇంకా ఇంకా కావాలని ప్రాకులాడుతాడు. నయానా భయానా దోచి దాస్తాడు. స్వార్థం కోసం అతగాడు తొక్కని అడ్డదారి వుండదు.



సుజాతా, చేయిజారిపోయిన కొడుకుని ఈ కూతుర్లో చూసు కుంటున్నాను అనే తండ్రిని మించిన స్వార్థపరుడు వుండడు. ఎందుకో తెలుసా?" కాస్త నవ్వి ఆగాడు.

సుజాత మౌనంగా కూర్చుని వింటోంది.

"ఉద్యోగం సద్యోగం లేని కూతురి మీద వుండదా ప్రేమ. కాలో, చెయ్యో కుంటుబడిన కుమార్తె మీద వుండదు. పోనీ ఏ తలచెడో, ఏ మొగుడో వదిలో వచ్చేసిన కూతురి మీద కూడా వుండదు. కాని పెళ్లి [illegible]క చక్కని ఉద్యోగం చేస్తూ మంచి జీతం తెస్తూ, బయట ప్రపంచం తెరియకుండా - ఒక్క కానీ ఖర్చు చేయకుండా ఇంట్లో పడివుండే కూతురంటే ఎందుకింత ప్రేమ? అర్థం కాలేదు కదూ. అబ్బాయి పెళ్ళాం మాట విని తండ్రికి ఎసరు పెడతాడు. పెళ్ళి కాని కూతురలా చెయ్యలేదు. ఆడ కూతురికి - గుండెల్లో తడి పెట్టి ఆ దేవుడు అన్యాయం

## తెలుగు హైకూలు

**కొలబద్ద.**

జీవితానికి
కొలబద్ద
చావు

**మృత్యువు**

మృత్యువు గుండుపిన్ను
ముద్దుపెట్టుకునే దాకా
బెలూన్ పక్షి అవుతూనే
వుంటుంది

—జింబో

చేశాడని నా నమ్మకం" నిట్టూర్చాడాయన. "మామయ్య గారూ! ఇదంతా ఇప్పుడెందుకు?" వినీ వినబడనంత నెమ్మదిగా అడిగింది.

"నువ్వే సంబంధం తెచ్చినా ఒద్దంటున్నావని విని" - నవ్వాడాయన సుజాత ముఖంలో ఒక్కసారి గుప్పున వెల్గిన ఆశ్చర్యం చూసి. ఆ ఆశ్చర్యం 'వీళ్ళు నాకు ఏం సంబంధం చూశారు' అన్న ప్రశ్నలాగా వుంది. "పిచ్చిదానా! నీకు తెలియని సంగతి నీకే చెప్పాలి కదా? పెళ్ళి చేసుకుంటావా సుజాతా?" చాలా ఆప్యాయంగా సుజాత తలపై చెయివేసి రాస్తూ అడిగారు.

చేసుకుంటానన్నట్టు తలూపింది సుజాత.

"శుభం. వచ్చే నెల ఈ పాటికి నీకో మంచి వాడిని చూస్తాను. నా మీద నమ్మకం వుందా?"

"ఉంది మామయ్యగారూ" అంది నెమ్మదిగా.

"చూడు సుజాతా పెళ్ళంటే నూరేళ్ళ పంట అన్న కథ చాలా పాతది. ఇప్పుడు సాగినన్నాళ్ళు సుఖ సంసారం. లేకపోతే - సంపాదించినన్నాళ్ళు సంసారం అనుకుంటే ఇబ్బంది పడవు. ఏళ్ళా పూళ్ళా ఎవరిక్కావాలి సుజాతా, చూస్తున్నాం కదా కళ్ళముందు ప్రపంచం బదలాయించేస్తుంటే... నన్నొదులు. నీ కెలాంటి వాడు కావాలో నా కర్థమైంది. నిన్ను నిన్నుగా కోరుకునేవాడు, ఆరాధించేవాడు, అనునయించేవాడు కావాలి. నువ్వీ అలముకున్న ఆర్థిక పంకం లోంచి పుట్టిన కలువవని అతగాడు గ్రహించాలి. అదే నా కోరిక" అంటూ ఉత్తరీయం అందుకుని లేచి నిలబడ్డారు.

"మామయ్యగారూ, మరి అమ్మా, నాన్న?"

"ఈ పవిత్ర భారతంలో కూతురు తిండి తింటూ కొడుకులని ఆరాధించే వాళ్ళు అంతా ఎలా వున్నారు? కొడుకు దగ్గరకి వెడతాడు!" కాస్త నవ్వి "లేదా నాలాగా హాయిగా రికామీగా ఏ శరణాలయంలోనో బ్రతికేస్తాడు. సుజాతా - ఆలంబనగా నిలచిన చెట్టునే తినేసే పరాన్నభుక్కులుగా పెద్దలు తయారైతే దాని ఫలితం అనుభవించక తప్పదు. వెంకట్రామయ్యా, ఏమిటలా వున్నావు?" అంటూ అటు తిరిగి సుజాత తండ్రికేసి అన్నారు.

అప్పుడే సుజాత కూడా తండ్రి కేసి చూసింది. ముఖం మాడ్చుకుని మొటమొటలాడిపోతూంది.

"చాలు, చాలు మంచి నీతులు బోధించడానికే వచ్చావు. కూతురికి పెళ్ళి చేయాలని మాకు మటుకు వుండదా? అది..." తండ్రి మాటకి అడ్డు వస్తూ—

"అడగలేదు నాన్నా, నా తప్పే. ఒప్పుకుంటున్నాను" అంది నెమ్మదిగా - అక్కడి నుంచి తన గదిలోకి వెళ్ళిపోతూ.

"తప్పు వెంకట్రామయ్యా! ఆడకూతురి వుసురు తగం కూడదు. అమాయకులు ఆడపిల్లలు. తల్లికీ, తండ్రికీ స్వార్థం వుంటుందా అనుకుంటారు. వాళ్ళలా అనుకోకుండా ప్రవర్తించకల్గాలి. వస్తాను..." అంటూ తెచ్చిన చేతి సంచీ అందుకుని బయటికి నడిచాడా మట్టం... సుందరమ్మకీ, వెంకట్రామయ్యగారికీ తలుచుకున్న కొద్దీ ఒళ్ళు మండి పోతోందా - మట్టం చెయ్యం వాగుడు.

"వీళ్ళు మట్టాలటండీ! సుఖంగా వుంటే కళ్ళలో నిప్పులు పోసుకుంటారు! ఏవే సుజాతా! ఆ చెప్పేది మాకే చెప్పి అఘోరిస్తే - నీ సొమ్మేం పోయింది?" మర్నాడు ఆఫీసుకి వెళ్ళడానికి ముందు టిఫిన్ బాక్సు అందిస్తూ కూతుర్ని కసిరారు.

"అప్పుడే చెప్పాను కదమ్మా - మీరు అడగలేదు...ఎలా చెప్పను? ఆయన అడిగాడు - చెప్పాను" సన్నగా నవ్వి అంది సుజాత.

"అవునే. చుట్టమై చూడవచ్చిన వాడు ఆత్మీయుడు. మేం అక్కడికి పరాయి వాళ్ళమనా? నీ కోసం అందర్నీ దూరం చేసుకు బతుకుతున్నాం కదే?" ముక్కు కొంగుతో తుడుచుకుంటూ దుఃఖం ఆపుకున్నారు సుందరమ్మగారు.

"బాధపడకమ్మా! నా కిప్పుడు వరుడెక్కడ దొరుకుతాడు" అంటూ ఆఫీసుకు చక్కాపోయింది సుజాత ... కాని ఆ రోజు సాయంత్రానికి సంబంధంతో చక్కా వచ్చారు - చుట్టంగారు. అదీ సుజాత ఇంటికి వచ్చే టైముకి వచ్చారు.

"మీరా?" అంటూ ఆగిపోయింది సుజాత.

"సుజాతా! ఈయన రామస్వామి. ఆఫీసరు. ఈ ఊళ్ళో ఇదివరకు పనిచేసి వెళ్ళారు."

"నాకు తెలుసు. మా ఆఫీసులోనే" అంది నవ్వి.

"నా పని మరీ సులభం అయిందయితే..." నవ్వేశారాయన. "సుజాతా, ఆశ్చర్యంగా లేదూ? ఎంత కాలం అయింది? ఐదా, ఆరేళ్ళా?" కూర్చుంటూ అడిగారు రామస్వామి. ఆ రోజుల్లో రామస్వామి సుజాతను వివాహం చేసుకోమని అడిగాడు. కాని బాధ్యతలను దించుకోలేని, దించుకోడం ఎలాగో తెలియని సుజాత - ఊ అనలేకపోయింది.

"నేను చాలా దూరం వెళ్ళిపోయి మళ్ళీ ఇలా నీకు కాళ్ళకి బంధం అవుతానని అనుకోలేదు సుజాతా' అన్నాడు. సుజాత ప్రేమగా ఆయనకేసి చూసింది. మాకు మరి ముహూర్తం పెట్టించడమేగా తరువాయి?" "అదీ అక్కర్లేదు సార్. దేవుడి ముందు మీరంతా సాక్షిగా పెళ్ళి చేసేయండి చాలు. ఇప్పుడింక బాజా భజంత్రీలూ, అలివేణి కుండలూ, అలకపాన్పులూ అక్కర లేదు. ఏం సుజాతా" అడిగారు.

వారి కోరికమేరకు పురోహితుడు ఇంట్లోనే పెళ్ళితంతు జరిపించాడు.

"చూడవయ్యా! నీ కూతురి ముఖం ఎలా వెల్గిపోతోందో" అని సంబరపడిపోతున్న చుట్టాన్నోసారి పరీక్షగా చూసి "ఇంతకీ ఈయన మనవాడేనా" అనుమానంగా అడిగారు వెంకట్రామయ్యగారు.

"లేకపోతే నేను చూడ్డం ఎలా పడుతుందయ్యా సుజాత ప్రేమించడం అనాలిగాని...బాధ్యతల ఊబిలో వుండి పెళ్ళికి అవకాశం లేక సుజాతలాగే మిగిలిపోయినవాడు రామస్వామి."



"అయితే యిద్దరూ..." ఆశగా అంటూ ఆగిపోయింది, చుట్టం ముఖం చూసి.

"అతగాడికి ఇల్లుంది. వాకిలుంది. మంచి ఉద్యోగం వుంది. ఇల్లరికం రాడు. నీకూ ఇల్లుంది. పెళ్ళాం వుంది. పింఛను వుంది. అవసరానికి ఆదుకునే మనసున్న కూతురుంది. నీ కెందుకయ్యా ఇల్లరికపు అల్లుడు? మూడు నిద్రలు చేసి చక్కాపోతారు జంట" తృప్తిగా అన్నారు చుట్టంగారు.

నిట్టూర్చింది సుందరమ్మ. ఆమెకి పదేస్గా వయసు పెరిగిపోయినట్టనిపించింది ... ... ... ఆ సాయంత్రం సినిమా చూసి వచ్చిన జంట సరదాగా కబుర్లు చెప్పాలని చూశారు. కాని బిగుసుకుపోయారు సుందరమ్మగారు. నవ్వి అత్తయ్యగారు కూతురు దూరం అవుతుందని బాధపడుతున్నారు సుజాతా. నీ కెప్పుడు నీ వాళ్ళని చూడాలని వున్నా నేను అభ్యంతర పెట్టను" అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు రామస్వామి.

భోజనాలు ముగించి - సుజాత గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. సుందరమ్మగారికా తలుపు కూతురు తన ముఖాన వేసినట్టనిపించి దుఃఖం పొంగుకు వచ్చింది.

గదిలో సుజాతని దగ్గరకి తీసుకుంటూ ఆ మాటా ఈ మాటా మాట్లాడుతున్న రామస్వామి హఠాత్తుగా ఆగిపోయి "సుజాతా" అని పిలిచాడు.

"ఏమైంది!"

"నీ తల్లో..." అంటూ ఓ నిడుపాటి వెంట్రుక పైకి తీస్తూ "ఫలితకేశం సుజాతా!" అన్నాడు గంభీరంగా.

ఆ దీపపు వెల్గులో అది వెండి తీగలాగా మెరిసింది.

ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారొక్క క్షణం. మరుక్షణం ఒకరి చేతుల్లోకి ఒకరు వాలిపోతూ గట్టిగా నవ్వుకోసాగారు.

"మన కలలు పండే సరికి ఫలితకేశాలు రాక ఆగుతాయా సుజాతా? సముద్రపు అలలు తగ్గాక స్నానానికి దిగాలని ఆగిన రకం మనం... ఐ లౌ యూ సుజాతా! నేను నా గుండె నిండుగా నిన్నే నింపుకున్నాను..."

"ఇప్పటిదాకా నా గుండె ఖాళీగానే వుండిపోయింది. కాని ఇప్పుడిక అక్కడెవరికీ చోటు లేదు" అంటూ రామస్వామి గుండెలో తలదాచుకుంది సుజాత.

"మీ మామయ్య మంచి మనిషి. ఇలాంటి పనులు ఇంకా ఇంకా చేయాలి." ఆమె తలపై చిన్న ముద్దు పెడుతూ దీపం ఆర్పేశాడు రామస్వామి.

సుందరమ్మ ఒంటికి కారం పూసినట్టు అనిపించిన ఆ కిసకిసలూ, పకపకలూ ఓ ఫలిత కేశాన్ని చూసని ఎలా చెప్పగలం? ఆమెకి చెప్పినా అర్థం కాదు. 'తలపండాకే పెళ్ళేమిటి నా శ్రాద్ధం' అనగలదు! అలాంటి వాళ్ళు అంతే!